క్లుప్తంగా

డీఐజీ, ఎస్పీలను కలిసిన ఎమ్మెల్యే వాసుబాబు



డీఐజీ అశోక్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ మేరీప్రశాంతిని ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వాసుబాబు వారికి పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పూర్తి సహకారం అందిస్తానని ఈ సందర్భంగా వారికి తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా స్పందన నిర్వహణ

ఏలూరు(మెట్రో): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతగానో దోహదం చేస్తుందని ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు తెలిపారు. సోమవారం ఉంగుటూరు మండలం నారాయణపురంలోని గణపవరం రోడ్డు పక్కన ఉన్న లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో నిర్వహించిన నియోజకవర్గ జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధితోపాటు స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి, ఆర్డీవో పెంచల కిషోర్ వివిధ శాఖల జిల్లా అధికారులు స్పందన కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి అర్జీలను సేకరించి సత్వరమే సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో స్పందనపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు స్పందన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పేకాట స్థావరాలపై దాడి

పెదపాడు: మండలంలోని వేర్వేరు చోట్ల పేకాట స్థావరాలపై దాడి చేసి 9మందిని అరెస్టు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం పెదపాడు మండలంలోని కొత్తూరు గ్రామ శివారు ప్రాంతంలో సోమవారం పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో దాడిచేసి పేకాట ఆడుతున్న నలుగురుని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1,800 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీంతోపాటు ఏపూరు గ్రామంలోని చెందుల కాలనీలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందడంతో పేకాట స్థావరంపై తన సిబ్బందితో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,200 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై బీ నాగ బాబు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

పెదపాడు: ఓ వ్యక్తి అదృశ్యంపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదపాడు మండలంలోని కొనికి గ్రామానికి చెందిన పందు వెంకట్రావు (34) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడతూ మతిస్థిమితం లేకుండా ఇంటి పట్టునే ఉంటున్నారు. ఈనెల 13న కృష్ణా జిల్లా కుదరవల్లిలో ఆటో ఎక్కి ఎక్కడికో వెళ్లిపోయాడని, గతంలో ఇలా కూడా ఈ విధంగా వెళ్లి వచ్చేవాడని ఈసారి రాకపోవడంతో తల్లి ఆగ్నేసమ్మ పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై బీ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకట్రావుకు భార్య పిల్లలు ఉన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు

పెదపాడు: ఏపూరులో లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిసాయి. సోమవారం ఉదయం 10గంటలకు లక్ష్మీనృశింహ స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

భీమడోలు: దుద్దేపూడి పంచాయతీ శివారు అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో సోమవారం ఆత్మీయ వీడ్కోలు సభ జరిగింది. పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకు చదువుకుంటున్న 132 మంది విద్యార్థులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ సందర్భంగా హెచ్ఎస్ ఎస్‌కే మస్తాన్ మాట్లాడుతూ విద్యార్థులంతా క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఉత్తమ ప్రతిభ గల విద్యార్థులకు బహుమతులను అందించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ పాతు బోయిన మౌనిక, టీచర్లు విజయకుమారి, దుర్గా ప్రసాదిని, ఝాన్సీ, ఉదయభాస్కర శివకుమారి, సాల్మన్, రవిభారతి పాల్గొన్నారు.

ముండూరులో వేద సభ

పెదవేగి : ముండూరులోని శ్రీయాజ్ఞవల్క్య రాజాశ్రమం 65వ వార్షికోత్సవ వేడుకల్లో చివరిరోజు సోమవారం వేదాంద మహాసభలు ఘనంగా ముగిసాయి. పీఠాధి పతి శ్రీకృష్ణ చరణానంద భారతి స్వామి మాట్లాడుతూ దేశంలో సనాతన హైందవ ధర్మాన్ని పునః ప్రతిష్ఠ చేయడమే లక్ష్యంగా వేద మహాసభలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రథమ పీఠాధిపతి చిత్ స్వరూపానందగిరి స్వామి, జగదీశ్వరానందగిరి స్వామి పాల్గొన్నారు.

నీరు అందింది.. పంట పండింది

- వంతులవారీ విధానంతో గట్టెక్కిన నీటి సమస్య
- ఆశాజనకంగా దాళ్వా పంట
- ఎకరాకు 50 నుంచి 60 బస్తాల దిగుబడి



కళకళలాడుతున్న దాళ్వా పైరు



యంత్రంతో కోసిన ధాన్యం రోడ్డుకు చేరవేస్తున్న రైతులు

గణపవరం/ఉంగుటూరు : దాళ్వాను భయపెట్టిన సాగునీటి సమస్య వంతుల వారీ విధానంతో గట్టెక్కింది. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అధికారులను సమన్వయపరచి చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సాగునీటి కొరతలేకుండా దాళ్వాపంట సాఫీగా రైతుల చేతికి వచ్చింది. మెట్ట ప్రాంతంలో 126 రకం, ఎస్ ఎల్10 రకం అధికంగా నాటారు. డెల్టాలో 1121 శ్రీధృతి రకం అధికంగా నాటారు. ఇది ఎంటీయూ రకం కావడం ప్రభుత్వం సిఫార్సు చేసింది. దాళ్వా తీవ్ర సాగునీటి సమస్యతో ఆరంభమైంది. దాళ్వాసాగుకు సాగునీటి లభ్యత తక్కువగా ఉందన్న అధికారుల ప్రకటనలతో రైతులు బెంబేలెత్తిపోయారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గంపెడాశలతో రైతులు సాగుకు సమాయత్తమైన తరుణంలో సాగునీటి సమస్య తెరమీదికి వచ్చింది. ముందస్తు సాగుకు సిద్ధం కావాలని, డిసెంబర్ నెలాఖరుకు మొత్తం నాట్లు పూర్తిచేయాలని, ఫిబ్రవరి తర్వాత సాగునీటికి తీవ్ర కొరత ఏర్పడే అవకాశం ఉందని ఇరిగేషన్, వ్యవసాయశాఖ ప్రకటనలు రైతులను ఆందోళనకు గురిచేశాయి. అందరి అంచనాలు తలక్రిందులు చేస్తూ ప్రస్తుత దాళ్వాలో సాగునీటి సమస్య ఏమాత్రం లేకుండానే రైతులు గట్టెక్కారు. శివారు గ్రామాల్లో కొన్ని ఆయకట్టు భూములకు సాగునీటి సమస్య ఎదురైనా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సాగునీటి సమస్యను అధిగమించారు. గణపవరం మండలంలోని ఎస్.కొండేపాడు, మొయ్యేరు, కేశవరం, కొత్తపల్లి, సరిపల్లె, గణపవరం గ్రామాలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందక రైతులు కొంత ఇబ్బంది పడ్డారు. కొండేపాడులో చేలు నెర్రలు తీశాయి. సర్పంచ్, అధికారులు సమన్వయంతో ఇంజన్లు ఏర్పాటుచేసి సాగునీటిని అందించారు. నిడమర్రు మండలంలోని చానమిల్లి, అడవికొలను, పెద నిండ్రకొలనులో శివారు భూములకు సరిగా నీరందక రైతులు కొంత ఇబ్బంది పడినా ఇంజన్‌లతో నీరందించారు. ప్రస్తుతం నియోజవర్గంలో దాళ్వాపైరు బంగారు వర్ణంలో కోతకు సిద్ధంగా ఉంది.

అధికారులను అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే వాసుబాబు

డిసెంబర్ మొదటి వారానికే వరినాట్లు పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులు రైతులకు వివరించినా ఫలితం లేదు. రైతులు జనవరి నెలాఖరుకు కాని వరినాట్లు వేయలేకపోయారు. ఎమ్మెల్యే వాసు బాబుకు పలు గ్రామాల నుంచి రైతులు సాగునీటి సమస్యపై ఫిర్యాదులు చేయగా ఆయన సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయశాఖ, డ్రైనేజి శాఖల అధికారులతో దాళ్వా ఆరంభమైన నాటి నుంచి తరచూ సాగునీటి పరిస్థితిని సమీక్షించారు. మురుగు కాల్వల నీటిని సాగుకు వినియోగించేందుకు అవసరమైన ఆయిల్ ఇంజన్లు, పైపులు సిద్ధం చేయించారు. ప్రధాన మురుగుకాల్వలకు అడ్డుకట్టలు వేసి ఆనీటిని దాళ్వా పొలాలకు అందించేందుకు అవసరమైన చర్యలు సిద్ధం చేయించారు. ఇవేమీ అవసరం లేకుండానే వంతులవారీ విధానంలోనే సాగునీరు సరిపడ అందడంతో అటు రైతులు, ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సాగునీటితో పాటు వాతావరణం కూడా అనుకూలించడంతో ప్రస్తుత దాళ్వా సిరులు పండించింది. ఎకరాకు 50నుంచి 55 బస్తాల వరకూ దిగుబడి వస్తుంది. రైతులు మాసూలు చేసిన ధాన్యాన్ని రోడ్లు, పుంత గట్టు, ఖాళీ స్థలాల్లోనూ ఎండబెడుతూ తేమశాతం తగ్గించుకోవడానికి పాటుపడుతున్నారు.

సాగునీటి సమస్య తీరింది



ప్రస్తుత దాళ్వాలో సాగునీటి కొరత వస్తుందన్న హెచ్చరికలతో కొన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ముందస్తు ఏర్పాట్లుచేశాం. ఆయిల్ ఇంజన్లు సిద్ధం చేయడంతోపాటు, మురుగు కాల్వలలోని నీరు సాగుకు వినియోగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. వ్యవసాయ, రెవెన్యూ, ఇరిగేషన్, డ్రైనేజి శాఖల అధికారులతో తరచూ సమావేశమై పరిస్థితిని సమీక్షించాను, మధ్యలో కొంత నీటిసమస్య వచ్చినా వంతులవారీ విధానంలో అధిగమించాం. – పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే

పంట ఆశాజనకంగా ఉంది



ఈ ఏడాది దాళ్వాపంట ఆశాజనకంగా ఉంది. 1121 రకం నాటాను. పంటకు ఎటువంటి చీడపీడలు ఆశించలేదన్నారు. మెడ విరిచే తెగులు వచ్చినా మందులు కొట్టడంతో పోయింది. ఎకరాకు 50 బస్తాలకు పైగా దిగుబడివస్తుందని ఆశిస్తున్నాం. మరో 15రోజుల్లో కోతలు ప్రారంభమవుతాయి. – ఏలూరి రాజేష్, దొంతవరం, రైతు

ఎంటీయూ 1121 రకం అధికంగా సాగు



ఈ సీజనులో పంట బాగా పండిందని ఎటువంటి చీడపీడలు లేకుండా చివరిదశకు చేరుకుందని ఏవో బాలిన వెంకటేష్ తెలిపారు. ఉంగుటూరు మండలంలో 22,309 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎంటీయూ 1121రకం ఎక్కువగా నాటారు. పీఆర్ 126, ఎస్ఎల్ 10రకాలు కొందరు నాటారు. పీఆర్ 126, ఎస్ఎల్ 10రకాలు ఎకరాకు 60బస్తాలు పైనే దిగుబడి వస్తోంది. – బాలిన వెంకటేష్, మండల వ్యవసాయ అధికారి, ఉంగుటూరు

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత

దెందులూరు: రైతు సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తొలి ప్రాధాన్యతనిస్తుందని ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. సోమవారం కొవ్వలి గ్రామ రైతుల ఆహ్వానం మేరకు నూతన వరి కోత యంత్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. సాగునీటి సరఫరా, వ్యవసాయ శాఖలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం, గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు, సాగుకు ముందస్తు పెట్టుబడితో పాటు అనేక పథకాలు అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఉద్యోగులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

దెందులూరు: జాతీయ ఉపాధి హామీ పథకం పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ముప్పవరం సర్పంచ్ మెండెం సంతోష్‌కుమార్ అన్నారు. సోమవారం ముప్పవరం పంచాయతీలో ఉపాధి పనులను ఆయన ప్రారంభించారు. మేట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఉపాధి కూలీల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

స్నేహితుడి వైద్యానికి ఆర్థిక సాయం

దెందులూరు: ప్రాణాపాయ స్థితిలో ఉన్న స్నేహితుడిని ఆదుకునేందుకు 1997లో అతనితోపాటు విద్యనభ్యసించిన పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ముందుకువచ్చారు. ఉండ్రాజవరానికి చెందిన డర్రు పాపారావు ప్రమాదంలో మెడ నరం తెగి వెన్నుపూస సమస్యతో బాధపడుతున్నారు. గుంటూరులో శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటికి చేరాడు. పాపారావు వైద్య నిమిత్తం ఖర్చులు పెరగడంతో అతని ఆర్థిక పరిస్థితి కుదేలైంది. ఈవిషయం తెలుసుకున్న పాపారావు స్నేహితులు సమావేశమై వైద్యానికి, ఇతర ఖర్చుల నిమిత్తం సోమవారం రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. ఈవిషయాన్ని పూర్వ విద్యా ర్థుల సంఘ సభ్యుడు సున్నా సుధీర్ సోమవారం తెలిపారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగు



బొమ్మిడిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఉంగుటూరు: సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆర్థిక అసమానతలు తొలగించేందుకు, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం జగన్‌మోహనరెడ్డి పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. బొమ్మిడిలో సోమవారం జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంతోపాటు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసు బాబు పాల్గొని ఇంటింటికీ పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలు ఎక్కడా ఆపలేదని ఈ విషయం ప్రజలు గ్రహించాలన్నారు. సీఎం జగన్ ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న విషయాన్ని గుర్తించి వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. నవరత్న పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని అన్నారు. అవినీతి, సిఫార్సులకు తావులేకుండా పథకాల లబ్ధి నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మరడ మంగరావు, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటశ్రీలక్ష్మి, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాలగోపి, సచివాలయాల మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, సర్పంచి మద్దాల రాధా కుమారి, ఎంపీటీసీ మేడవరపు విద్యాలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు మేడవరపు మోహన్, బొమ్మిడి వైసీపీ నాయకులు మేడరపు కిరణ్, మద్దాల త్రిమూర్తులు, బాదరాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


నాడు- నేడు పనుల జాప్యంపై కలెక్టరు ఆగ్రహం



ఉంగుటూరు హైస్కూల్లో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న కలెక్టరు ప్రసన్న వెంకటేష్

ఉంగుటూరు: పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులు, యర్రమిల్లిపాడు హౌసింగు పనుల జాప్యంపై కలెక్టరు ప్రసన్న వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉంగుటూరు హైస్కూల్లో చేపట్టిన నాడు-నేడు పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఇంజనీరింగు అధికారులతో మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరానికి తరగతి గదులను సిద్ధం చేయాలని ఆదేశాంచారు.యర్రమిల్లిపాడులో 32 ఇళ్లకు 16 ఇళ్ల మాత్రమే నిర్మిస్తుండటంపై అధికారులను ప్రశ్నించారు. నల్లలమాడు చెరువులో చేపట్టిన ఉపాధి పనులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనులు వారానికి రెండు రోజులు ఎంపీడీవోలు పరిశీలించాలన్నారు. ఆర్డీవో పెంచల కిషోర్, ఆర్‌డబ్ల్యూఎస్ సత్యనారాయణ ఎంపీడీవో ఇన్‌ఛార్జి ఆంజనేయులు, డీఈవో అవధాని, హౌసింగు అధికార్లు ఉన్నారు.


నాడు ఎంపీడీవోలు.. నేడు జిల్లాస్థాయి ఉన్నతాధికారులు



డీపీవో జీవీకే మల్లికార్జునరావు, జిల్లా సీఈవో రవికుమార్, డ్వామా పీడీ రాము, డీఎల్‌డీవో రమణ

ఉంగుటూరు: ఒకనాడు ఉంగుటూరు మండలంలో ఎంపీడీవో సేవలందించిన జీవీకే మల్లికార్జునరావు, రాము, రవికుమార్ నేడు జిల్లాస్థాయి ఉన్నతాధికారులుగా పనిచేస్తున్నారు. ఉంగుటూరు మండలం నారాయణపురంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో వీరంతా కలుసుకుని అక్కడికి వచ్చిన స్థానిక నాయకులు, అధికారులతో ముచ్చటించి ఆనాటి స్మృతులు నెమరువేసుకున్నారు. అందులో జీవీకే మల్లికార్జునరావు, ఎ.రాము, రవికుమార్ ఉంగుటూరు మండలంలో ఎంపీడీవోలుగా పనిచేశారు. ప్రస్తుతం డీపీవోగా మల్లికార్జునరావు, డ్వామా పీడీగా రాము, జిల్లా సీఈవోగా రవికుమార్ జిల్లాస్థాయి అధికారులుగా పనిచేస్తున్నారు. ఈ ముగ్గురు సీఎం జగన్ ప్రభుత్వంలో గతేడాది జిల్లా అధికార్లుగా పదోన్నతి పొందారు. ఈ ముగ్గురూ స్పందన కార్యక్రమం అనంతరం విశ్రాంతి సమయంలో కలుసుకుని ఆనందం వ్యక్తం చేస్తూ చలోక్తులతో సరదాగా ముచ్చటించుకున్నారు. వీరితోపాటు డీఎల్‌డీవో రమణ ఉన్నారు.

ఇంటింటా ఆదరణ



కొమిరేపల్లిలో జగనన్నే మా భవిష్యత్తు సర్వే నిర్వహిస్తున్న పులవర్తి సంతోష్, నాయకులు

దెందులూరు: రాబోయే కాలమంతా ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని పార్టీ ఏలూరు పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శి పులవర్తి సంతోష్ అన్నారు. సోమవారం జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, కొత్తగూడెం సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత, ఎంపీటీసీ పులవర్తి వరమణి, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), పార్టీ గ్రామ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, పార్టీ నాయకులు వినయ్, గుర్రం దిలీప్, శ్రీను, యోహానులు సర్వే నిర్వహించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరలా సీఎం అవుతారని సంతోష్ అన్నారు. గృహసారథులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ప్రమాద రహిత సమాజ స్థాపన



ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

భీమడోలు: ప్రమాద రహిత సమాజ స్థాపనకు విద్యార్థి దశ నుంచి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ఎంతైనా అవసరమని భీమడోలు అగ్నిమాపక కేంద్రం అధికారి జి.నాగరాజు అన్నారు. జాతీయ అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన సోమవారం భీమడోలులోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులకు అగ్ని ప్రమాదాలు, వాటి నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ లీకవ్వడం, పాఠశాలల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించే ప్రమాదాలు, చిన్నారులు ఆందోళన తరుణంలో గుండె ఆగిన తరుణంలో సీపీఆర్ చేసే విధానాలపై అగ్ని మాపక సిబ్బంది డెమో ద్వారా వివరించారు. అగ్నిమాపకాధికారి జి.నాగరాజు మాట్లాడుతూ అందరూ ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్, అగ్ని మాపక సిబ్బంది పాల్గొన్నారు.

పేదల హృదయాల్లో సీఎం జగన్ చెరగని ముద్ర



భీమడోలులో గడపగడపకు మన ప్రభుత్వం వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పాము సునీతామాన్‌సింగ్, రావిపాటి సత్యశ్రీనివాస్ తదితరులు

భీమడోలు: సంక్షేమ పాలనను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలంతా ఆకాంక్షిస్తున్నారని మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీతామాన్‌సింగ్ అన్నారు. భీమడోలు పంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ బుధవారం సాయంత్రం 4 గంటలకు చేపట్టనున్న గడపగడపకు మన ప్రభుత్వం వాల్ పోస్టర్‌ను సోమవారం భీమడోలు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీతామాన్‌సింగ్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఇచ్చిన హామీలన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా పథకాలను పేదలకు అందిస్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరి హృదయాల్లో చెరగని ముద్రను పెనవేసుకున్నారన్నారు. గ్రామంలోని మునుపెన్నడూ లేని అభివృద్ధి జరిగిందని, సంక్షేమ ఫలాలు అర్హులకు అందాయన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి ఎస్.ఠాగూర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గుండుగొలను సొసైటీ అభివృద్ధికి కృషి



గుండుగొలను సొసైటీ త్రిసభ్య కమిటీ

భీమడోలు: గుండుగొలను సొసైటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా నియమితులైన చైర్మన్ నంద్యాల సుబ్బరాజు అన్నారు. గుండుగొలను సొసైటీకి త్రిసభ్య కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సొసైటీ చైర్మన్‌గా నంద్యాల సుబ్బరాజు(గుండుగొలను), పర్సన్లుగా మద్రాపు నాగేంద్రరావు (గుండుగొలను), ముంగర రామాంజనేయులు (ఆగడాలలంక)ను నియమించారు. ఈ ఉత్తర్వులను సొసైటీ సీఈవో ఎస్.జగదీష్ నూతన పాలకవర్గానికి అందజేసారు. త్రిసభ్య కమిటీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువూరి సత్యనారాయణరాజు, వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ జహీర్, వార్డు సభ్యులు గొటికల మురళీ, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

వృద్ధులకు వరం వైఎస్సార్ కంటివెలుగు

గణపవరం: గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులకు వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం వరమని, ఈ కార్యక్రమంలో కంటి పరీక్షలుచేసి ఉచితంగా కళ్లజోళ్లు, మందులు ఇస్తామని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. సోమవారం గణపవరం మండలం వరదరాజపురంలో వృద్ధులకు కంటివెలుగు పథకంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 60 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. వీరందరికీ కళ్లజోళ్లు అవసరమని ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. సర్పంచ్ కోడేటి నర్సింహమూర్తి, సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్య సహాయకుడు యోహాన్, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

- **భీమడోలు:** వైఎస్సార్ కంటి వెలుగు పథకం వృద్ధులకు వరమని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా అన్నారు. పోలసానిపల్లిలో సోమవారం వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య నిపుణులు జే.వెంకట రెడ్డి ఆధ్వర్యంలో 40 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఎంపీటీసీ అంబటి దేవీ ప్రసాద్, ఆరోగ్య సహాయకులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పాఠశాలల పనివేళల మార్పు

దెందులూరు: ఎండ తీవ్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పనివేళలు మార్పు చేసినట్టు దెందులూరు ఎంఈవో సీహెచ్ బుద్ధావ్యాస్ సోమవారం తెలిపారు. ఇప్పటివరకు 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు పనిచేశాయన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు పాఠశాలలు పనిచేస్తాయని అన్నారు. 11 గంటల తరువాత భోజనం పెట్టి విద్యార్థులను పంపిస్తామన్నారు.

దాత రెహమాన్‌కు ముతవల్లి పదవి

దెందులూరు: దెందులూరుకు చెందిన దాత రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఫజ్లుల్ రెహమాన్‌కు ఏపీ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఏపీసీఈఓ ముతవల్లి పదవిని సోమవారం ప్రకటించింది. నియామక పత్రాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ దెందులూరులో రెహమాన్‌కు అందజేశారు. ఆర్ రెహమాన్ మసీదును ఆయన 2022లో వక్ఫ్ బోర్డుకు దానం చేశారు. రెహమాన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ముతవల్లి పదవికి ఎంపిక చేసిందని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. రెహమాన్ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.

మందుబాబులకు జరిమానా

భీమడోలు: భీమడోలులో బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న ఏడుగురు మందుబాబులను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేసారు. ఒకొక్కరికి రూ.300 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై చావా సురేష్‌కుమార్ సోమవారం తెలిపారు.